

తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

దీపావళి పండుగా సంధర్భంగా
కార్యాలయానికి సెలవు..
పునఃదర్శనం మంగళవారం

సంపుటి: 02
సంచిక:69

24 క్యారెట్లు 146,100.00 | కిలో వెండి 2,05,000.00 | chourastha Digitals | 08.11.2026 ఆదివారం, హైదరాబాద్

అయోధ్యలో దీపాల వెలుగుల వైభవం



- సరయూ తీరంలో 30 లక్షలకుపైగా దీపాల జ్యోతులు
- 56 ఘాట్లలో కన్నుల పండువగా పదో దీపోత్సవ వేడుకలు.
- పాల్గొన్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం యోగి ఆదిత్యనాథ్
- రామాయణ ఘట్టాలతో సాంస్కృతిక ప్రదర్శనలు
- లేజర్ షోతో మంత్రముగ్ధులైన భక్తులు
- 500 ఏళ్ల పోరాటం తర్వాత అయోధ్యలో రామజన్మభూమి కల సాకారమైందన్న యోగి



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య నగరం దీపాల కాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోయింది. సరయూ నది తీరంలోని 56 ఘాట్లలో 30 లక్షలకుపైగా మట్టి దీపాలను వెలిగించి పదో దీపోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నిర్వహించిన ఈ వేడుకలతో అయోధ్య ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఘాట్లన్నీ దీపకాంతులతో ప్రకాశించడంతో భక్తులు, పర్యాటకులు ఈ అద్భుత దృశ్యాలను చూసి మంత్రముగ్ధులయ్యారు.

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :

ఈ చారిత్రాత్మక వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సాధువులు, ప్రముఖులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సరయూ నది తీరంలో సామూహిక హారతి నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం మరింత శోభాయమానంగా మారింది.

రామాయణ ఘట్టాలతో ప్రత్యేక ఆకర్షణ

దీపోత్సవంలో భాగంగా సరయూ ఘాట్ల వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రామాయణంలోని ముఖ్యమైన ఘట్టాలను ప్రతిబింబించేలా వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. లేజర్ లైట్ అండ్ సౌండ్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అయోధ్య ।మిగతా 2 లో।



మేడిగడ్డ కుంగినా బాధ్యత లేదా..?

బీఆర్ఎస్‌పై సీఎం నిప్పులు

పదేళ్లలో పాలమూరుకు చేసిందేమీ లేదు.
మేడిగడ్డ నుంచి పాలమూరు వరకు.. బీఆర్ఎస్‌పై ఎదురుదాడి
కాళేశ్వరం కూలినా గొప్పలు ఆగలేదు.
మేడిగడ్డ వద్దే వారిని పాతిపెట్టాలి.. ఇదే సరైన శిక్ష
ఈ నెల 9న కొడంగల్‌లో రూ.10 వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
హకీంపేటలో అగ్రి ఎక్స్‌పో, రైతుమేళా ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభించిన
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:

కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో నిర్వహించిన అగ్రి ఎక్స్‌పో, రైతుమేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆ తర్వాత ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి, దాని పేరును, స్థలాన్ని మార్చి, అంచనాలను పెంచి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం తమ ఘనతగా చెప్పుకున్న బీఆర్ఎస్ నేతలు.. అదే బ్యారేజీ కుంగిపోయినప్పుడు మాత్రం బాధ్యత తీసుకోవడానికి వెనుకాడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. మేడిగడ్డ వద్ద వారిని పాతిపెట్టడమే సరైన శిక్ష అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలు, పాలమూరు జిల్లాకు జరిగిన అన్యాయంపై సీఎం విరుచుకుపడ్డారు.



తెలంగాణకు వరప్రదాయనిగా మారాల్సిన ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో దాదాపు ।మిగతా 2 లో।

కమిషన్ల కోసమేనా రేవంత్ మూడేళ్ల కష్టం?

- కొడంగల్ సభలో సీఎం వ్యాఖ్యలకు హరీశ్‌రావు కౌంటర్
- బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రస్తావన.. 24 గంటల కరెంటు ఏమైంది
- యూరియా కోసం రైతుల అవస్థలు.. రైతుబంధు నిధులపై విమర్శలు
- సిద్దిపేటలో ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీ పనులు నిలిపివేశారని ఆరోపణ
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా :

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ సభలో చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. కొడంగల్ అభివృద్ధికి కేసీఆర్, హరీశ్‌రావు ఏం చేశారంటూ సీఎం ప్రశ్నించడంపై ఆయన కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొడంగల్‌లో రెండు 50 పడకల ఆసుపత్రులు, ఫైర్ స్టేషన్, గోదాములు ।మిగతా 2 లో।



డిఫెన్స్ మద్యం అక్రమ విక్రయాల గుట్టురట్టు

- 163 బాటిళ్లు స్వాధీనం
- వీటి విలువ సుమారు రూ.2.11 లక్షలు
- రిటైర్డ్ సైనికుల కోటా మద్యాన్ని వ్యాపారంగా మార్చిన వైనం
- భర్తలు సరఫరా చేస్తే భార్యల ద్వారా విక్రయాలు

2లో



గాంధీ, నెహ్రూల స్థాయి

మోదీకి లేదు

- మరో 120 ఏళ్లు అధికారంలో ఉన్నా చేరుకోలేరు
- ప్రధాని మోదీపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపే తీవ్ర విమర్శలు
- ఎస్ఐఆర్‌తో ఓటు హక్కుకు ముప్పు
- త్రివర్ణ పతాకాన్ని మళ్లీ మళ్లీ ఎగురవేస్తా
- ఎన్నికల సంఘంపై పోరాటం కొనసాగుతుంది

2లో

రాప్తాడు ఘటనపై

సుమోటో కేసు నమోదు

- మానవ హక్కుల కమిషన్ సీరియస్..
- బాలికపై దాడిని తీవ్రంగా పరిగణించిన కమిషన్
- నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- లక్ష్మి చదువుకు అండగా ఉంటానన్న ఆనంద్ మహీంద్రా..
- స్నేహితురాలిని కాపాడేందుకు ప్రయత్నించిన బాలికకు ప్రశంసలు

2లో

ఢిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యం

- గ్రాప్-3 ఆంక్షలు అమలు
- ఏక్యూఐ 382కు చేరడంతో అధికారుల అప్రమత్తం
- నిర్మాణ పనులపై నిషేధం, పాత వాహనాల రాకపోకలపై ఆంక్షలు
- దీపావళి వేళ కాలుష్యం పెరిగే ప్రమాదం
- ప్రభుత్వాల తీరుపై సుప్రీంకోర్టు ఆందోళన




న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఎన్‌సీఆర్ ప్రాంతాన్ని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇప్పటికే ప్రమాదకర స్థాయికి చేరిన ।మిగతా 3 లో।

రాజీవ్ ప్రధాని అవుతాననగానే భయపడ్డా

- సోనియా గాంధీ భావోద్వేగ వ్యాఖ్యలు
- 'ఆ పదవి వద్దని వేడుకున్నా.. అయినా రాజీవ్ వినలేదు'
- ఇందిరా గాంధీ హత్య జరిగిన రోజే ప్రధాని బాధ్యతలు చేపట్టాలని రాజీవ్‌ను కోరారు..
- ఆ పదవి వద్దంటూ వేడుకున్న సోనియా
- నేను ప్రధాని కాకపోయినా వారు నన్ను చంపేస్తారు'
- త్వరలో విడుదల కానున్న సోనియా ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో కీలక విషయాలు



న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

భారత రాజకీయ చరిత్రలో అత్యంత విషాదకరమైన ఘట్టాల్లో ఒకటైన ఇందిరా గాంధీ హత్యకు సంబంధించిన అనేక వ్యక్తిగత అనుభవాలను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) ।మిగతా 2 లో।

హైదరాబాద్‌లో నీటి కష్టాలు

- హైడ్రా చర్యలతో ట్యాంకర్ల సరఫరాకు బ్రేక్
- జలమండలి సరఫరా తగ్గుదల..
- ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడుతున్న నగరవాసులు
- మూడు రోజులైనా అందని ట్యాంకర్లు..
- రెట్టింపైన ధరలతో ప్రజలపై భారం

2లో

హైదరాబాద్‌లో నీటి కష్టాలు

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

కోటి జనాభా దాటిన హైదరాబాద్ మహానగరంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఒకవైపు జలమండలి నుంచి ఆశించిన స్థాయిలో నీటి సరఫరా లేకపోవడం, మరోవైపు భూగర్భ జలాలు అడుగంటడంతో నగరవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, ఐటీ కారిడార్‌లోని విల్లాలు, వాణిజ్య సముదాయాలు, శివారు కాలనీలకు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లే ప్రధాన ఆధారంగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో అక్రమ బోర్లు, నీటి వ్యాపారాల నియంత్రణ పేరుతో హైడ్రా చేపట్టిన ఆకస్మిక చర్యలు నగరంలో నీటి సరఫరాపై తీవ్ర ప్రభావం చూపించాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే బోర్లపై చర్యలు తీసుకోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



బోర్లపై హైడ్రా ఆకస్మిక దాడులు

సున్నం చెరువు, తమ్మిడికుంట, తెల్లాపూర్ తదితర ప్రాంతాల్లో చెరువుల సమీపంలో, ప్రభుత్వ స్థలాల్లో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లు, అక్రమ బోర్లపై హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. కనెక్షన్లు తొలగించడంతో పాటు మోటార్లు, సంపులను ధ్వంసం చేయడంతో ప్రైవేట్ ట్యాంకర్ల నీటి సరఫరా వ్యవస్థకు ఆటంకం ఏర్పడింది. భూగర్భ జలాలను అక్రమంగా తోడేస్తున్నారనే ఆరోపణలతో చేపట్టిన ఈ చర్యలు పర్యావరణ పరిరక్షణకు అవసరమే అయినప్పటికీ, ప్రజలకు ప్రత్యామ్నాయ నీటి సరఫరా అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది.

మూడు రోజులైనా రాని ట్యాంకర్లు

హైడ్రా చర్యల ప్రభావంతో మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, తెల్లాపూర్‌తో పాటు మియాపూర్, కూకట్‌పల్లి, మణికొండ ప్రాంతాల్లోనీటి కొరత తీవ్రంగా కనిపించింది. ట్యాంకర్ కోసం ఆర్డర్ చేసినా రెండు, మూడు రోజుల వరకు సరఫరా అందని పరిస్థితి నెలకొంది. నీటి లభ్యత తగ్గడంతో కొందరు ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు ధరలను రెట్టింపు చేసి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రోజువారీ అవసరాలకు కూడా నీరు దొరక్క అపార్ట్‌మెంట్లలో నివసించే ప్రజలు బిందెలతో రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ట్యాంకర్ల యజమానులు సమ్మె బాట పట్టడంతో సంక్షోభం మరింత తీవ్రమైంది.

బౌటర్ వెలుపలి నుంచి నీటి సరఫరాకు అనుమతి

నగరవాసుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో హైడ్రా కమిషనర్ ట్యాంకర్ల అసోసియేషన్ ప్రతినిధులతో అత్యవసరంగా చర్చలు జరిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలి ప్రాంతాల నుంచి నీటిని తీసుకొచ్చేందుకు తాత్కాలిక సడలింపులు కల్పించినట్లు తెలుస్తోంది. దీంతో ట్యాంకర్లు తిరిగి రోడ్లపైకి వచ్చినప్పటికీ, రెండు రోజుల పాటు నెలకొన్న గందరగోళం నగరవాసులకు తీవ్ర ఇబ్బందులను మిగిల్చింది.

ప్రజల అవసరాలే ప్రాధాన్యం కావాలి

అక్రమ బోర్లు, భూగర్భ జలాల దోపిడీని అరికట్టడం ప్రభుత్వ సంస్థల బాధ్యతే. అయితే, అలాంటి చర్యలు చేపట్టే ముందు ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా వేసవి పరిస్థితులు, పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక నీటి సరఫరా ప్రణాళిక రూపొందించాలి. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల కనీస అవసరమైన తాగునీటికి ఆటంకం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. అక్రమాలను అరికట్టే క్రమంలో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగే ప్రమాదం ఉంది. హైదరాబాద్ వంటి మహానగరం నీటి కోసం అల్లాడకుండా జలమండలి, హైడ్రా సమన్వయంతో శాశ్వత పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాప్తాడు ఘటనపై సుమోటో కేసు నమోదు

తెలంగాణ చౌరస్తా, ఆంధ్రప్రదేశ్



అనంతపురం జిల్లా రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి బాలికపై జరిగిన దాడి ఘటనను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. పాఠశాల గదిలోకి చొరబడిన హేమంత్ అనే యువకుడు ఎలక్ట్రిక్ రంపంతో బాలికపై దాడికి పాల్పడిన ఘటనపై విచారణకు ఆదేశించింది.పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై సమగ్ర విచారణ జరిపి నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, అనంతపురం జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు.

లక్ష్మి చదువుకు ఆనంద్ మహీంద్రా భరోసా

రాప్తాడు ఘటనలో దాడికి గురైన స్నేహితురాలిని కాపాడేందుకు ప్రాణాలకు తెగించి ప్రయత్నించిన బాలిక లక్ష్మి చదువుకు ఆర్థిక సహాయం అందిస్తానని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా హామీ ఇచ్చారు. బాలిక కుటుంబం పేదరికంతో ఇబ్బందులు పడుతోందని, నివాసం కూడా శిథిలావస్థలో ఉందని ఓ నెటిజన్ ఎక్స్ వేదికగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆనంద్ మహీంద్రా.. లక్ష్మి విద్యాభ్యాసానికి అండగా నిలుస్తానని ముందుకొచ్చారు.

ఆనంద్ మహీంద్రా స్పందనపై మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రాణాలకు ప్రమాదం ఉన్నప్పటికీ స్నేహితురాలిని కాపాడేందుకు లక్ష్మి ధైర్యంగా ప్రయత్నించిందని ప్రశంసించారు.

అసలేం జరిగింది?

రాప్తాడు మండలం అయ్యవారిపల్లికి చెందిన పదో తరగతి బాలిక స్థానిక జడ్పీ హైస్కూల్‌లో చదువుతోంది. ఉదయం తరగతి గదిలో విద్యార్థులు ఉండగా, బాలికకు వరుసకు బాబాయ్ అయ్యే హేమంత్ ఒక్కసారిగా ఎలక్ట్రిక్ రంపంతో లోపలికి ప్రవేశించి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో 15 ఏళ్ల బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.కళ్లముందే జరుగుతున్న దాడితో తరగతి గదిలోని విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఓ విద్యార్థిని మాత్రం ధైర్యంగా ముందుకొచ్చి నిందితుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఆమె రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. విద్యార్థుల కేకలతో నిందితుడు రంపాన్ని అక్కడే పడిలేసి పరారయ్యాడు.ఈ ఘటనతో పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, రక్షణ చర్యలపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కమిషన్ల కోసమేనా రేవంత్ మూడేళ్ల కష్టం?

తరువాయి భాగం

నిర్మించామని, తండాలకు బీటీ రోడ్లు వేయడంతోపాటు మిషన్ కాకతీయ ద్వారా చెరువులను అభివృద్ధి చేశామని గుర్తుచేశారు.

ముఖ్యమంత్రి రేపంత్‌రెడ్డి మూడేళ్లుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశానని చెప్పుకోవడంపై హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. ఆ కష్టం ప్రజలకు సేవ చేయడానికా? లేక కమిషన్లు, డబ్బులు సంపాదించడానికా? అని ప్రశ్నించారు. నిజంగా ప్రజల కోసం అంతగా కష్టపడితే బీఆర్ఎస్ హయాంలో రైతులకు అందించిన 24 గంటల ఉచిత విద్యుత్ ఇప్పుడు ఎందుకు ఏడు, ఎనిమిది గంటలకే పరిమితమైందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతుల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఆరోపించారు.

యూరియా కోసం రైతుల ఎదురుచూపులు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అవసరమైన యూరియా బస్తాలను ఆటో డ్రైవర్ల ద్వారా నేరుగా పొలాల వద్దకు చేరవేసేవారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు చెప్పులు వరుసలో పెట్టి గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.యాప్‌లో బుకింగ్ కోసం ప్రయత్నించి, యూరియా దొరికితే లాటరీ తగిలినట్లుగా భావించాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు.కరోనా మహమ్మారి సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు పథకాన్ని కొనసాగించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మూడు విడతల్లో రైతుబంధు నిధులను సక్రమంగా అందించలేదని ఆరోపించారు. ఒకసారి ఎకరానికే, మరోసారి రెండు ఎకరాలకే నిధులు ఇచ్చారని, ఇంకోసారి పూర్తిగా నిలిపివేశారని విమర్శించారు. రైతులకు మరింత ఆర్థిక సాయం అందించాల్సింది పోయి, ఇచ్చిన హామీలను సైతం అమలు చేయడం లేదని మండిపడ్డారు. కొడంగల్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టిందని హరీశ్‌రావు వివరించారు. రెండు 50 పడకల ఆసుపత్రులు, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి తండాకు బీటీ రోడ్లు నిర్మించామని తెలిపారు. మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రతి మండలంలో గోదాములు నిర్మించామని,మిషన్ కాకతీయ కింద చెరువులను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు తరలించారని ఆరోపించారు. సిద్దిపేటలో వెయ్యి పడకల ఆసుపత్రి,నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశారని విమర్శించారు. సిద్దిపేట అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్క ఇటుక కూడా వేయలేదని వ్యాఖ్యానించారు.

రంగనాయక సాగర్ కాలువ పనులు ఎక్కడ?

రంగనాయక సాగర్ కాలువల నిర్మాణాన్ని తమ ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తి చేశామని హరీశ్‌రావు తెలిపారు. నరసింహగుంట చెరువును నింపే కాలువ వంటి పనుల్లోకొంతభాగం మాత్రమే మిగిలి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా మిగిలిన పనులను పూర్తి చేయలేదని, తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు.గ్రామాల్లో కొత్తగా గజం తారు రోడ్డు వేసిన దాఖలాలు కూడా లేవని ఆరోపించారు.

కేసీఆర్ కిట్ పథకానికి మంగళం పలికారని విమర్శ

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు ఉచిత వైద్యం అందించడంతోపాటు బాలింతలకు కేసీఆర్ కిట్ పంపిణీ చేశామని హరీశ్‌రావు గుర్తుచేశారు. బాలింతలకు, వారి సహాయకులకు భోజన సదుపాయం కూడా కల్పించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్ పథకాన్ని నిలిపివేసి, ప్రభుత్వ ఆసుపత్రుల వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిసారించాలని హరీశ్‌రావు సూచించారు.మాటలకే పరిమితం కాకుండా ప్రజలకు అవసరమైన విద్యుత్,సాగునీరు, ఎరువులు,మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గాంధీ, నెహ్రూల స్థాయి మోదీకి లేదు

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :



ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూలు దేశానికి చేసిన సేవలను మోదీ ఎప్పటికీ అధిగమించలేరని వ్యాఖ్యానించారు. మరో 120 ఏళ్ల పాటు అధికారంలో ఉన్నా ఆ మహానాయకుల స్థాయికి చేరుకోలేరని విమర్శించారు.మహాత్మా గాంధీని భారతదేశ ఆత్మగా, అంబేద్కర్‌ను దేశ వెన్నెముకగా, నెహ్రూను దేశ మేధస్సుగా అభివర్ణించారు. స్వాతంత్ర్య పోరాటంలో మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న భావజాల సంస్థకు ఎలాంటి పాత్ర లేదని, అప్పట్లో వలస పాలకులకు సేవ చేయడానికే పరిమితమైందని ఆరోపించారు. స్వాతంత్ర్యం కోసం మహానాయకులు పోరాడుతుంటే, కొందరు బ్రిటిష్ పాలకులకు సేవకులుగా వ్యవహరించారని విమర్శించారు.దేశంలో ఓటర్ల హక్కులను నియంత్రించేందుకు ప్రధాని మోదీ, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని దీప్కే ఆరోపించారు. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియను ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మందికి పైగా ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపించారు. ఓటర్ల తొలగింపులు జరగని రాష్ట్రం ఒక్కటి కూడా లేదని పేర్కొన్నారు.

త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినందుకు తనను, తన ఇద్దరు సోదరులను జైలులో పెట్టారని దీప్కే వెల్లడించారు. భారతదేశంలో ఇలాంటి పరిస్థితులు చివరిసారిగా బ్రిటిష్ పాలనలోనే కనిపించాయని వ్యాఖ్యానించారు. దేశంలోని ప్రతి ప్రాంతంలో తాను త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తానని, ఎక్కడ అరెస్టు చేసినా తిరిగి వచ్చి జాతీయ జెండాను ఎగురవేస్తానని సవాల్ విసిరారు.దేశంలో స్వతంత్ర, నిష్పక్షపాత ఎన్నికల వ్యవస్థ ఏర్పడే వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని దీప్కే స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా కొచ్చిలో నిర్వహించనున్న 'జంతర్ మంతర్ ఎట్ కొచ్చి' నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం ఆయన కేరళకు చేరుకున్నారు. స్థానిక నిర్వాహకులతో పాటు ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

డిఫెన్స్ మద్యం అక్రమ విక్రయాల గుట్టురట్టు

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

సైనికులకు ప్రభుత్వం అందించే డిఫెన్స్ కోటా మద్యాన్ని కొందరు అక్రమ వ్యాపారానికి ఉపయోగిస్తున్నారు. తక్కువ ధరకు లభించే ఈ మద్యాన్ని కొందరు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు ఇతరుల కోటాతో సహా సేకరించి, అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమ దందాకు తెరలేపారు. హైదరాబాద్‌లోని అల్వాల్ ప్రాంతంలో జరుగుతున్న ఈ అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి గుట్టురట్టు చేశారుఈ తనిఖీల్లో మొత్తం 163 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.11 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. రిటైర్డ్ సైనికులు డిఫెన్స్ క్యాంటీన్ల నుంచి మద్యం బాటిళ్లను తీసుకొచ్చి, తమ భార్యల ద్వారా ఇళ్ల వద్దే విక్రయాలు సాగిస్తున్నట్లు విచారణలో గుర్తించారుమల్కాజిగిరి ఎస్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్‌రావు నేతృత్వంలోని బృందం సరస్వతీనగర్, లోతుకుంట ప్రాంతంలో తనిఖీలు చేపట్టింది. రామాంజనేయులు, మన్యం నాగప్రసన్న దంపతుల ఇంట్లో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించి 96 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. భర్త రామాంజనేయులు డిఫెన్స్ క్యాంటీన్ల నుంచి మద్యం తీసుకొచ్చి భార్య నాగప్రసన్నకు అందిస్తుండగా, ఆమె ఇంటి వద్దే కస్టమర్లకు విక్రయిస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఈ వ్యవహారంపై ఇద్దరిపైనా కేసు నమోదు చేయగా, నాగప్రసన్నను అరెస్టు చేసి అల్వాల్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.మరోవైపు న్యూ బోయినిపల్లిలోని సౌజన్య కాలనీలో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌బి సీఐ గణపతిరెడ్డి నేతృత్వంలో అధికారులు సోదాలు నిర్వహించారు. ముసిమి లెంక (39) అనే మహిళ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 67 డిఫెన్స్ మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్టు చేసి అల్వాల్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు.డిఫెన్స్ కోటా మద్యాన్ని వ్యక్తిగత వినియోగానికి కాకుండా అక్రమంగా విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు.

మేడిగడ్డ కుంగినా బాధ్యత లేదా..?

తరువాయి భాగం



రూ.20 లక్షల కోట్ల బడ్జెట్ అందుబాటులో ఉన్నప్పటికీ ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయారని అన్నారు. ముఖ్యంగా పాలమూరు జిల్లాలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తిచేయలేదని ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టును తామే నిర్మించామని గొప్పలు చెప్పుకున్న నేతలు.. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోతే ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును పర్యవేక్షించానని హరీశ్‌రావు గొప్పలు చెప్పుకున్నారని, అప్పట్లో తన పేరును కూడా 'కాళేశ్వరరావు'గా ప్రచారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు.మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు నిల్వ లేకపోతే కన్నెపల్లి పంపులు పనిచేయవని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ నీటిని నిల్వ చేయలేని పరిస్థితి నెలకొందని సీఎం పేర్కొన్నారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటే అసలు ఆ బ్యారేజీని ఎందుకు నిర్మించారని బీఆర్ఎస్ నేతలను నిలదీశారు.ఎల్‌నినో ప్రభావంపై కూడా బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా కరవు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నప్పటికీ తెలంగాణలోనే కరవు వచ్చినట్లు ప్రజలను భయపెడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో కొడంగల్‌కు నీళ్లు, నిధులు, ప్రాజెక్టులు ఏవీ ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అందిస్తున్నామని తెలిపారు. గతంలో ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ మనసు ఒప్పలేదని విమర్శించారు.కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై కొన్ని పత్రికలు విషప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. గత మూడేళ్లుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నానని సీఎం పేర్కొన్నారు.లగచర్ల విషయంలోనూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేసి రైతులను భయపెట్టాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఢిల్లీనోయిడా తరహాలో హైదరాబాద్‌లగచర్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. లగచర్లలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద కంపెనీలు ముందుకొస్తున్నాయని వెల్లడించారు. హకీంపేటలో 250 ఎకరాల విస్తీర్ణంలో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని, అన్ని ఉన్నత విద్యాసంస్థలు ఒకే చోట ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.తాండూరు కందిపప్పుకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని, ఇప్పటికే పలు దేశాలకు ఎగుమతి అవుతుండటం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ నెల 9న కొడంగల్‌లో రూ.10 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. కేటీఆర్ వేషాలు మార్చినంత మాత్రాన రేవంత్‌రెడ్డి కాలేరని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేని తప్పులను కేసీఆర్ కుటుంబం చేసిందని విమర్శించారు. ఇసుక వ్యాపారానికి అడ్డుగా ఉన్నారని నేరెళ్ల దళితులను వేధించిన ఘటనను, గిట్టుబాటు ధర అడిగిన రైతులకు ఖమ్మంలో బేడీలు వేసిన ఘటనను ప్రజలు మర్చిపోలేదని అన్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, యాసంగి పంటల సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జులై వరకు వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని పేర్కొంటూ, అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు, ప్రభుత్వం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నేతల తప్పుడు ప్రచారాన్ని నమ్మి రైతులు నష్టపోవద్దని రేవంత్‌రెడ్డి కోరారు. ఎన్నికల్లో ఓటు వేయలేదనే కక్షతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేసీఆర్ కుటుంబం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

రాజీవ్ ప్రధాని అవుతాననగానే భయపడ్డా

తరువాయి భాగం

అధినేత్రి సోనియా గాంధీ తన ఆత్మకథలో వెల్లడించారు. 1984 అక్టోబర్ 31న ఇందిరా గాంధీ హత్యకు గురైన రోజే రాజీవ్ గాంధీని ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయాలని కోరినప్పుడు తన గుండె పగిలినంత పనైందని ఆమె గుర్తుచేసుకున్నారు. రాజీవ్ ఆ మాట చెప్పగానే తన గుండెల్లో ఎవరో కత్తి దించినట్లు అనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని పదవిని చేపడితే రాజీవ్ ప్రాణాలకు ముప్పు ఉంటుందని భావించి, ఆ బాధ్యతలు స్వీకరించవద్దని తాను వేడుకున్నట్లు సోనియా తెలిపారు. అయితే రాజీవ్ స్పందిస్తూ.. తాను ప్రధాని పదవి చేపట్టకపోయినా, తనను ఎలాగైనా చంపేస్తారని చెప్పినట్లు వెల్లడించారు. ఈ ఉద్వేగభరితమైన విషయాలను త్వరలో విడుదల కానున్న తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో వివరించారు.1984 అక్టోబర్ 31న ఢిల్లీలోని 1, సఫ్దర్‌జంగ్ రోడ్ నివాసంలో ఇందిరా గాంధీ తన సొంత భద్రతా సిబ్బంది కాల్పుల్లో హత్యకు గురయ్యారు. ఆ రోజు ఉదయం జరిగిన పరిణామాలను సోనియా తన పుస్తకంలో కళ్లకు కట్టినట్లు వివరించారు. ఇందిరా గాంధీ తన కార్యాలయానికి వెళ్లిన కొద్దిసేపటికే వరుసగా తుపాకీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని తెలిపారు. తొలుత అవి టపాసుల శబ్దాలుగా భావించినప్పటికీ, ఏదో తేడా ఉందని అనిపించిందన్నారు.అంతలోనే పిల్లల సంరక్షకురాలు ఒంగ్మో ఆందోళనతో తన బాత్రూమ్ తలుపు బాదిందని, భయంతో ఆమె మాటలు కూడా రాక చేతులతో సైగలు చేస్తూ గార్డెన్ వైపు చూపించిందని సోనియా గుర్తుచేసుకున్నారు. వెంటనే తాను అక్కడికి పరుగెత్తుకుంటూ వెళ్లగా, ఇందిరా గాంధీని తెల్ల అంబాసిడర్ కారులో ఆస్పత్రికి తరలిస్తున్నారని తెలిపారు. ఆమె చీరపై, ఛాతీపై రక్తం కనిపించిందని, కళ్లు తెరిచి ఉన్నప్పటికీ స్పందించే స్థితిలో లేరని వివరించారు.భారీ ట్రాఫిక్ కారణంగా ఆస్పత్రికి వెళ్లే మార్గంలో కారు నెమ్మదిగా కదిలిందని, మధ్యలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కూడా ఆగాల్సి వచ్చిందని సోనియా పేర్కొన్నారు. కారులో సైరన్ కూడా లేదని గుర్తుచేసుకున్నారు. ఆస్పత్రికి చేరుకున్న తర్వాత కూడా పరిస్థితులు గందరగోళంగా ఉన్నాయని, రాజీవ్ ఎక్కడ ఉన్నారు? పిల్లలను ఎలా సురక్షితంగా ఇంటికి తీసుకురావాలి? అనే ఆలోచనలు తనను వెంటాడాయని తెలిపారు.1984 అక్టోబర్ 31 మధ్యాహ్నం 2 గంటలకు ఇందిరా గాంధీ మరణించినట్లు వైద్యులు ప్రకటించడంతో ఆ విషాదాన్ని తట్టుకోలేకపోయానని సోనియా వెల్లడించారు. ఇంటికి చేరుకున్న తర్వాత రాహుల్, ప్రియాంక కన్నీళ్లతో తనను కౌగిలించుకున్నారని చెప్పారు. ఇంట్లో సిబ్బంది ఏడుస్తుండటాన్ని చూసిన పిల్లలు.. 'పాపా ఎక్కడ? దాదీకి ఏమైంది? మీరు నిజం చెప్పడం లేదు' అంటూ ప్రశ్నించారని ఆత్మకథలో పేర్కొన్నారు.తన ఆత్మకథ ప్రచురణకు సంబంధించి చోటుచేసుకున్న పరిణామాలపైనా సోనియా గాంధీ స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై పుస్తకంలో చేసిన విమర్శల పట్ల ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా అసౌకర్యం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. తొలుత పుస్తక ప్రచురణపై ఆసక్తి చూపిన సంస్థ, ఆ తర్వాత భారత్‌లో ప్రచురించలేమని వెనక్కి తగ్గడం తనకు నిరాశ కలిగించిందన్నారు. అయితే ఈ పరిణామంలో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని వ్యాఖ్యానించారు. సోనియా గాంధీ ఆత్మకథలోని కొన్ని భాగాలను బ్రిటన్‌కు చెందిన 'ది గార్డియన్' పత్రిక ప్రచురించడంతో దేశ రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇందిరా గాంధీ హత్య, రాజీవ్ గాంధీ ప్రధాని బాధ్యతలు స్వీకరించిన సందర్భం, గాంధీ కుటుంబం ఎదుర్కొన్న వ్యక్తిగత విషాదాలను ఈ పుస్తకం మరోసారి ప్రజల ముందుకు తీసుకురానుంది.,



అయోధ్యలో దీపాల వెలుగుల వైభవం

తరువాయి భాగం

రాముడు భారతీయ విలువలకు ప్రతీక: గవర్నర్

చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను చాటిచెప్పేలా నిర్వహించిన ఈ కార్

అమరత్వాలే నేటి ఉద్యమాలకు దిక్సూచి

భారత విద్యార్థి ఉద్యమ చరిత్రలో ఉస్మానియా యూనివర్సిటీకి ప్రత్యేక స్థానం ఉంది. వియత్నాం విప్లవం, నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాలు, చేగువేరా, భగత్‌సింగ్ వంటి విప్లవ యోధుల స్ఫూర్తితో ఉస్మానియా క్యాంపస్‌లో ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలు బలపడ్డాయి. ఈ క్రమంలో కామ్రేడ్ జార్జిరెడ్డి 1972 ఏప్రిల్ 14న హత్యకు గురయ్యారు. ఆయన అమరత్వం విద్యార్థి ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచింది.



జార్జిరెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్ ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (PDSU) నిర్మాణానికి కృషి చేశారు. ఎమర్జెన్సీ కాలంలో నీలం రామచంద్రయ్యతో కలిసి అరెస్టైన ఆయన 1975 నవంబర్ 5న ఇల్లందు అటవీ ప్రాంతంలో హత్యకు గురయ్యారు. మరో విద్యార్థి ఉద్యమ నాయకుడు శ్రీపాద శ్రీహరి 1976 నవంబర్ 3న పోలీసుల కాల్పుల్లో మరణించారు. కోలా శంకర్, చేరాలు, రమణయ్య, రంగవల్లి, స్నేహలత, మారోజు వీరన్న, యానాల వీరారెడ్డి తదితరులు కూడా ఉద్యమంలో ప్రాణాలర్పించారు.

విద్యార్థి సమస్యలకే పరిమితం కాని ఉద్యమం

PDSU విద్యారంగ సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా కార్మిక, కర్షక, యువజన, మహిళా, అస్తిత్వ, ప్రజాస్వామిక ఉద్యమాలకు మద్దతుగా నిలిచిందని సంఘం పేర్కొంటోంది. రైల్వే కార్మికుల పోరాటం, రమీజాబీ ఘటన, దివిసీమ ఉప్పెన, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, లగచర్ల రైతాంగ పోరాటం వంటి సందర్భాల్లో తన పాత్రను కొనసాగించిందని తెలిపింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలను దాటి దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తున్నట్లు పేర్కొంది.విద్యార్థి ఉద్యమం అంటే క్యాంపస్ సమస్యల పరిష్కారానికే పరిమితం కాదని, సమాజంలోని అన్యాయాలు, అసమానతలు, దోపిడీ, వివక్షకు వ్యతిరేకంగా సాగాల్సిన సామాజిక మార్పు ప్రక్రియ అని సంఘం అభిప్రాయపడుతోంది. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడం, హక్కుల కోసం పోరాడే చైతన్యాన్ని కల్పించడం, కొత్త నాయకత్వాన్ని తయారు చేయడం ఉద్యమంలో భాగమని పేర్కొంటోంది.

ప్రపంచవ్యాప్తంగా యువత ఉద్యమాలు

2024 నుంచి 2026 మధ్య బంగ్లాదేశ్, కెన్యా, సెర్బియా, నేపాల్, ఇండోనేషియా, మడగాస్కర్, మొరాకో, ఫిలిప్పీన్స్ తదితర దేశాల్లో విద్యార్థులు, యువత వివిధ సమస్యలపై ఆందోళనలు చేపట్టారు. ఉద్యోగ రిజర్వేషన్లు, పన్నుల పెంపు, అవినీతి, ప్రభుత్వ జవాబుదారీతనం, సోషల్ మీడియా ఆంక్షలు, నిరుద్యోగం, విద్యా, వైద్య సదుపాయాల వంటి అంశాలు ఈ ఉద్యమాలకు కారణమయ్యాయి. ఈ పరిణామాలు యువతలో పెరుగుతున్న ప్రజాస్వామిక ఆకాంక్షలు, సామాజిక న్యాయం పట్ల ఉన్న డిమాండ్లను ప్రతిబింబిస్తున్నాయి.

విద్యా, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు

భారత్‌లోనూ పరీక్షల నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకేజీ ఆరోపణలు, ఫలితాల వివాదాలు విద్యార్థుల ఆందోళనలకు కారణమయ్యాయి. 2024లో నీట్ పరీక్షకు సంబంధించిన వివాదాలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. పరీక్షల పారదర్శకత, NTA జవాబుదారీతనం, విద్యార్థులకు న్యాయం చేయాలనే డిమాండ్లు ముందుకొచ్చాయి.
అదేవిధంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతాయనే ఆందోళనతో పలు ప్రాంతాల్లో నిరసనలు జరిగాయి. ఓటు హక్కు పరిరక్షణ, ప్రక్రియలో పారదర్శకత, ఎన్నికల సంఘం జవాబుదారీతనం వంటి అంశాలు ప్రధాన డిమాండ్లుగా ముందుకొచ్చాయి. ఈ పరిణామాలు విద్యార్థులు, యువత విద్యా హక్కులతో పాటు ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణలోనూ భాగస్వాములవుతున్నారని తెలియజేస్తున్నాయి.

అమరవీరుల ఆశయాల సాధనే లక్ష్యం

నిరుద్యోగం, విద్యా ప్రైవేటీకరణ, అవినీతి, సామాజిక వివక్ష, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వంటి సమస్యలపై విద్యార్థి యువతను సంఘటితం చేయాల్సిన అవసరం ఉందని ఈ ఉద్యమ అనుభవాలు సూచిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన పోరాటాలను అధ్యయనం చేస్తూ, విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించి, హక్కుల సాధన కోసం ఉద్యమాలను నిర్మించాల్సిన బాధ్యత నేటి విద్యార్థులపై ఉంది.జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి తదితర విప్లవ విద్యార్థి అమరవీరులు కన్న కలలను సాకారం చేయడానికి వారి ఆశయాల సాధన దిశగా పోరాటం కొనసాగించడమే నేటి విద్యార్థుల కర్తవ్యం. వారి త్యాగాలు రాబోయే తరాల విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తాయని PDSU పేర్కొంటోంది.

పి.మహేష్
పిడిఎస్ యు
రాష్ట్ర అధ్యక్షులు



అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి

- మండల తహసిల్దార్ కి వినతి పత్రం అందించిన మాజీ ఎంపీపీ,జడ్పీటీసీ

కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో గల మండల తహసిల్దార్ కార్యాలయ అవరణలో తహసిల్దార్ డాక్టర్ రాపెల్లి రాముడు కి తాజా మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో తెలంగాణా రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం మేరకు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి చొరవతో,సహకారంతో,కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో కొన్ని కోట్ల రూపాయలు వెచ్చించి 240 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద ప్రజలను గుర్తించి అప్పుడున్న ఎమ్మార్వో ,ఆర్డీవో, ఎంపీపీ,జెడ్పిటిసి,ఆయా గ్రామాల సర్పంచ్ లు 160 మంది లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేసినారు.ఇప్పటికే ఎంపిక చేసిన 160 మంది లబ్ధిదారులను అర్హులుగా కొనసాగిస్తూ మిగతా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు అర్హులను గుర్తించి కేటాయించాలన్నారు.ప్రస్తుతం డబుల్ బెడ్రూం ఇళ్లలో నీటి వసతి లేదు,విద్యుత్ సప్లై లేదు.పూర్తి పనులు చేపట్టి పనుల పూర్తయిన తర్వాతనే లబ్ధిదారులకు కేటాయించాలని తహశీల్దార్ ని కలిసిన కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్,మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ జూకంటి శిరీషఅనీల్,సర్పంచ్ లు భూసి సదాశివ రెడ్డి,మంతెన రాజయ్య, తీగల నాగరాజు,అడిగొప్పుల రాణి మోహన్,గరిడే అశోక్‌లక్ష్మీ,మాజీ సర్పంచ్ లు పుప్పాల నాగార్జున రావు,గోనె శ్యామ్,బుర్ర మంగ సదానందం,ఆడెపు శ్రీదేవిరాజు దొమ్మటి రజిత శ్రీనివాస్, ఉపసర్పంచ్ వేణు,మాజీ ఉప సర్పంచ్ లు లోనే సదయ్య,సుదాటి కరుణాకర్ రావు,నాయకులు మోహన్,కళ్లేపల్లి సాగర్ ఉయ్యాల ఒద్దేలు,ఎరబాటి రవి,జక్కెనబోయిన కనుకయ్య, కుంభం రాజు ముదిరాజ్ ,లబ్ధిదారులు, తదితరులు, పాల్గొన్నారు.

మూడు గంటల్లోనే బంగారం చోరీ కేసు ఛేదన!



- కాసిపేట,మందమర్రి పోలీసుల మెరుపు దర్యాప్తు..
- చోరీ సొత్తు స్వాధీనం

కాసిపేట, తెలంగాణ చౌరస్తా :

బస్సులో ప్రయాణిస్తున్న మహిళ పర్సులో నుంచి బంగారం చోరీ చేసిన ఘటనలో కాసిపేట, మందమర్రి పోలీసులు మెరుపు వేగంతో స్పందించారు. ఫిర్యాదు అందిన కేవలం మూడు గంటల్లోనే కేసును ఛేదించి చోరీకి గురైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.మందమర్రి నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్తున్న బస్సులో సంధ్యారాణి అనే మహిళ ప్రయాణిస్తుండగా, మందమర్రి బస్టాండ్‌లో బస్సు ఎక్కిన సమయంలోనే ఆమె పర్సులోని బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. కొద్దిసేపటి తర్వాత ఆధార్ కార్డు కోసం పర్సు తెరిచి చూడగా బంగారం కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న కాసిపేట ఎస్ఐ శ్రావణ్‌కుమార్ అప్రమత్తమై సోమగూడెం వద్ద బస్సును నిలిపివేసి ప్రయాణికులను తనిఖీ చేశారు. అయినప్పటికీ బంగారం లభించకపోవడంతో మందమర్రి పోలీసులకు సమాచారం అందించారు.దీంతో మందమర్రి ఎస్ఐ నరేశ్ తన సిబ్బందితో కలిసి బస్టాండ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో ముఠాగా ఏర్పడిన కొందరు వ్యక్తులు ప్రయాణికుల్లా నటిస్తూ మహిళను చుట్టుముట్టి, ఆమె బ్యాగులోని బంగారాన్ని చోరీ చేసినట్లు గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి వారి నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల సమన్వయం.. నిందితులకు చెక్!

కాసిపేట, మందమర్రి పోలీసుల సమన్వయం, అప్రమత్తత, వేగవంతమైన దర్యాప్తుతో కేవలం మూడు గంటల్లోనే చోరీ కేసును ఛేదించడం అభినందనీయం. పోలీసుల పనితీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఢిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యం

తరువాయి భాగం

కాలుష్యం దీపావళి పండుగ నేపథ్యంలో మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 382కు చేరడంతో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) మూడో దశ ఆంక్షలను అమల్లోకి తెచ్చింది. గ్రాప్3 ఆంక్షల్లో భాగంగా అత్యవసరం కాని నిర్మాణ పనులపై నిషేధం విధించారు. బీఎస్3, అంతకంటే పాత ప్రమాణాల పెట్రోల్ కార్లు, బీఎస్4, అంతకంటే పాత ప్రమాణాల డీజిల్ కార్ల రాకపోకలపై పరిమితులు విధించారు. కంకర రోడ్లపై నిర్మాణ సామగ్రి రవాణాను నిషేధించడంతో పాటు స్టోన్ క్రషర్లు,గనుల తవ్వకాలను నిలిపివేయాలని ఆదేశించారు.ఏక్యూఐ 301 నుంచి 400 మధ్య ఉంటే గాలి నాణ్యత అత్యంత దారుణమైన స్థాయిలో ఉన్నట్లు పరిగణిస్తారు మరోవైపు ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితి మరింత దిగజారకముందే నివారణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీపావళి సందర్భంగా బహుమతులు ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి కూడా వాహనాల రాకపోకలను పెంచి కాలుష్యానికి కారణమవుతోందని అభిప్రాయపడింది. బహుమతుల పంపిణీ కోసం పెద్ద సంఖ్యలో కార్లు, ఇతర వాహనాలు తిరగడం, టపాసులు కాల్చడం గాలి నాణ్యతను మరింత దిగజారుస్తున్నాయని పేర్కొంది.కొంతమంది సంపన్నులు బహుమతుల పంపిణీని తమ హోదాకు చిహ్నంగా మార్చుకున్నారని వ్యాఖ్యానించింది. ఏటా కాలుష్యంపై చర్చలు జరుపుతూ, ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. కాలుష్య నియంత్రణకు ప్రజల జీవనశైలిలో, ముఖ్యంగా పండుగల సమయంలో ఆచారాల్లో మార్పులు రావాలని సూచించింది. పంట వ్యర్థాల దహనాన్ని అరికట్టేందుకు వాటి సేకరణ ధరను ముందుగానే ప్రకటించాలని సుప్రీంకోర్టు సూచించింది. పంట వ్యర్థాల నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలని పేర్కొంది. పట్టణ ప్రాంతాల నుంచి వెలువడుతున్న కాలుష్య కారకాల పాత్రపైనా ప్రశ్నలు లేవనెత్తింది.ఢిల్లీలో గాలి పీల్చడం రోజుకు 30 సిగరెట్లు తాగడంతో సమానమని అమికస్ క్యూరీ అపరాజిత సింగ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం కాలుష్యంలో పంట వ్యర్థాల దహనం వాటా 14 శాతంగా ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి..కాలుష్య నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నివారణ చర్యలు ప్రారంభించిందని కోర్టుకు వివరించారు.






ఎస్.ఎస్ బ్యూటీ వరల్డ్ లో ఘనంగా 'లక్కీ డ్రా'

- లక్కీ డ్రా ను నిర్వహించిన బ్యూటీ వరల్డ్ నిర్వాహకులు సుమ
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్.హెచ్.ఓ అఖిల
- 'లక్కీ డ్రా' లో విజేతలకు బహుమతులు అందజేత...
- యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్ల సందడితో అంగరంగ వైభవంగా ముగిసిన వేడుకలు

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :



మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తూ వ్యాపార రంగంలో రాణించడంతో పాటు వినియోగదారులను ప్రోత్సహించేలా వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని లక్ష్మీదేవిపల్లి ఎస్.హెచ్.ఓ అఖిల అన్నారు. కొత్తగూడెం 55వ డివిజన్ సురక్ష హాస్పిటల్ వీధిలోని 'ఎస్.ఎస్ బ్యూటీ వరల్డ్ అండ్ బొటీక్' నిర్వాహకురాలు సుమ ఆధ్వర్యంలో దసరా నుండి దీపావళి పండుగ ముగిసే వరకు ఫేషియల్ సేవలు పొందిన మహిళా కస్టమర్ల కోసం నిర్వహించిన ప్రత్యేక ఆఫర్ల లక్కీ డ్రా కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి లక్ష్మీదేవిపల్లి ఎస్.హెచ్.ఓ అఖిల ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. అనంతరం విజేతలకు తన చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

లక్కీ డ్రా విజేతలు.. మొదటి బహుమతి (రూ. 4,000): పద్మశ్రీ
రెండవ బహుమతి (రూ. 3,000): స్వప్న
మూడవ బహుమతి (రూ. 2,000): ప్రియా
ఈ లక్కీ డ్రా కార్యక్రమంలో ప్రముఖ యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్లు అనిత వెస్లీ, అంజూరాజులతో పాటు శైలజ, స్వప్న,తాటి అనిత,బ్యూటీ పార్లర్ సిబ్బంది స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నకిలీ ఐఫోన్లు, ఆపిల్ వాచీల
విక్రయంతో మోసం.. ఒకరి అరెస్ట్



- ఒరిజినల్ పేరుతో క్లోన్ వస్తువుల విక్రయం
- మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు
- భారీగా నకిలీ వస్తువులు స్వాధీనం

శేరిలింగంపల్లి – తెలంగాణ చౌరస్తా:

నకిలీ ఐఫోన్లు, ఆపిల్ వాచీలు, ఇయర్‌బడ్స్‌ను అసలైనవిగా నమ్మించి విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మలక్‌పేట్ సైద్‌నగర్‌కు చెందిన అల్తమాష్ (26) నకిలీ, క్లోన్ చేసిన ఐఫోన్లు, ఆపిల్ వాచీలు, ఇయర్‌బడ్స్‌ను ఒరిజినల్ వస్తువులుగా ప్రచారం చేస్తూ అమాయకులకు విక్రయిస్తున్నాడు. ఈ వ్యవహారంపై క్రైమ్ నంబర్ 1267/2026 కింద కేసు నమోదు చేసిన పోలీసులు నవంబర్ 7న నిందితుడిని అరెస్ట్ చేశారు.నిందితుడి నుంచి రెండు ఐఫోన్లు (వాటిలో ఒకటి నకిలీది), నాలుగు నకిలీ ఆపిల్ వాచీలు, ఏడు నకిలీ ఇయర్‌బడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసంలో ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఆవేష్ ఖాన్ కూడా భాగస్వామిగా ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉండటంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.అరెస్టు చేసిన అల్తమాష్‌ను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ మాదాపూర్ డివిజన్ మార్గదర్శకత్వంలో రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె. రామిరెడ్డి, క్రైమ్ సిబ్బంది ఈ కేసును ఛేదించారు. నిందితుడి అరెస్టులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.





పర్యావరణహిత దీపావళి వేడుకలతో అలరించిన నాగార్జున పాఠశాల

- కాలుష్యరహిత దీపావళిపై విద్యార్థులకు అవగాహన
- చిన్నారుల సందడితో కన్నులపండువగా రంగుల దినోత్సవాలు
- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- కరస్పాండెంట్ డాక్టర్ నాగరాజు నకిరేకంటి

రామన్నపేట – తెలంగాణ చౌరస్తా:

రామన్నపేటలోని నాగార్జున పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా కాలుష్యరహిత దీపావళి సందేశంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ నాగరాజు నకిరేకంటి మాట్లాడుతూ దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. టపాసులు కాల్చడం వల్ల వాయు, శబ్ద కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు.టపాసులకు దూరంగా ఉంటూ దీపాలు వెలిగించి, ఆనందాన్ని పంచుకుంటూ పండుగను జరుపుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, చిన్న తనం నుంచే పిల్లల్లో ప్రకృతిపై ప్రేమ, పర్యావరణ స్పృహ పెంపొందించాలని పేర్కొన్నారు. దీపావళి పండుగ విశిష్టతను వివరిస్తూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేశారు.

రంగుల వేడుకలతో చిన్నారుల సందడి

పాఠశాల ప్రీప్రైమరీ విభాగంలో చిన్నారుల కోసం పింక్ డే, వైట్ డే, పర్పుల్ డే వేడుకలను సైతం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఆయా రంగులకు అనుగుణంగా రంగురంగుల దుస్తులు ధరించిన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆటలు, సరదా కార్యక్రమాల ద్వారా రంగుల గుర్తింపు, వాటి ప్రాధాన్యతను చిన్నారులకు సులభంగా వివరించారు. దీంతో పాఠశాల ప్రాంగణం చిన్నారుల చిరునవ్వులు, రంగుల సందడితో కళకళలాడింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రేఖ మాట్లాడుతూ కాలుష్యానికి దూరంగా.. ప్రకృతికి దగ్గరగా..దీపాల వెలుగులతో దీపావళిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు.పండుగల ద్వారా విద్యార్థుల్లో ఆనందం, సృజనాత్మకతతో పాటు పర్యావరణ స్పృహను పెంపొందించవచ్చని తెలిపారు.
విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి పరిరక్షణ వంటి విలువలను చిన్నారులకు తెలియజేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేఖతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.కాలుష్యానికి దూరంగా..ప్రకృతికి దగ్గరగా..దీపాల వెలుగులతో దీపావళిని జరుపుకుందాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం! అనే సందేశంతో వేడుకలు ముగిశాయి.



ప్రశాంత్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బండరావిరాల బీఆర్ఎస్ నేతలు

- గ్రామాభివృద్ధి, పార్టీ బలోపేతంపై ఆత్మీయ చర్చ

అబ్దుల్లాపూర్‌మెట్ – తెలంగాణ చౌరస్తా:

బండరావిరాల గ్రామ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యూత్ ఫోర్స్ నాయకులు శనివారం ఆ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డిని స్థానిక పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.గ్రామ యువజన నాయకుడు గుండ్ల సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు ఆత్మీయంగా చర్చించుకున్నారు.గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు చర్చించారు.ఈ కార్యక్రమంలో బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, ఉపసర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కన్నె భరత్, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, గుండ్ల భవాని శివ ముదిరాజ్‌తో పాటు గ్రామ బీఆర్ఎస్ యూత్ ఫోర్స్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పి డి ఎస్ యు తోనే విద్యారంగ సమస్యల పరిష్కారం

- సమ సమాజ స్థాపనకై విద్యార్థులు ఉద్యమించాలి
- పి డి ఎస్ యు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్

జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా:

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో అమలు చేస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలు,సంస్కరణలను తిప్పికొడుతూ,ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసి,సమానత్వ సమాజ స్థాపన లక్ష్యంగా భవిష్యత్ విద్యార్థి ఉద్యమాలను నిర్మించడమే విద్యార్థి అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని పి.డి.ఎస్.యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ పిలుపునిచ్చారు.కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో విద్యార్థి అమరవీరులకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రాణా ప్రతాప్ మాట్లాడుతూ....1960 దశకం చివరిలో దేశంలో,ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన సామ్రాజ్యవాద వ్యతిరేక,ప్రజాస్వామిక,జాతి విముక్తి ఉద్యమాల ప్రభావంతో ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా పి.డి.ఎస్.యు ఆవిర్భవించిందని తెలిపారు.జార్జ్ రెడ్డి,జంపాల చంద్రశేఖర ప్రసాద్,శ్రీపాద శ్రీహరి,కొలాశంకర్,చేరాలు, రంగవల్లి,చేరలు,రమణయ్య,సాంబయ్య తదితర ఎందరో విప్లవ విద్యార్థి అమరవీరులు విద్యార్థుల హక్కుల సాధన,శాస్త్రీయ విద్య,సమానత్వ సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు.దేశంలో బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తూ,ప్రైవేటీకరణ,కార్పొరేటీకరణ విధానాలను వేగవంతం చేస్తోందని విమర్శించారు.విద్యారంగాన్ని ప్రైవేటు శక్తులకు అప్పగిస్తూ విద్యను వ్యాపార వస్తువుగా మార్చడం ద్వారా పేద,మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విశ్వవిద్యాలయాలకు సరిపడా నిధులు కేటాయించకపోవడం,ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయకపోవడం,పరిశోధనలకు తగిన ప్రోత్సాహం అందించకపోవడం వల్ల ఉన్నత విద్యాసంస్థలు సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.8,500 కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ,ముస్లిం మైనారిటీ సంక్షేమ గురుకుల విద్యార్థులకు సొంత భవనాలు లేకపోవడం,మౌలిక సదుపాయాల కొరత,ప్రభుత్వ విద్యాసంస్థలు,సంక్షేమ హాస్టళ్లలో పర్యవేక్షణ లోపం వంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.విప్లవ విద్యార్థి అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అంటే వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం మాత్రమే కాదని,వారు ఆశించిన సామాజిక మార్పు కోసం నిరంతరం కృషి చేయడమే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు.విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థులను ఐక్యం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కొనేటి ప్రశాంత్,డివిజన్ ఉపాధ్యక్షుడు పొడిశెట్టి అశోక్,నాయకులు రాజేష్, శ్రావణ్,దిలీప్ పాల్గొన్నారు.



తొమ్మిదేళ్లుగా గంజాయి దందా..
ఎట్టకేలకు చిక్కిన లేడీ డాన్!

- ఆసిఫ్‌నగర్‌లో కలపాటి నీతూ భాయ్‌ను అరెస్ట్ చేసిన ఈగల్ బృందం
- 30కి పైగా కేసులు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే లక్ష్యంగా దందా
- అక్రమ సంపాదన, మనీలాండరింగ్‌పై ఈడీ సోదాలతో కలకలం

శేరిలింగంపల్లి – తెలంగాణ చౌరస్తా:



హైదరాబాద్ నగరంలో కొన్నేళ్లుగా గంజాయి దందాను కొనసాగిస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్న కలపాటి నీతూ భాయ్ ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడింది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ అండ్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) బృందం ఆసిఫ్‌నగర్‌లో ఆమెను అరెస్ట్ చేసింది.పోలీసుల సమాచారం ప్రకారం.. గత తొమ్మిదేళ్లుగా గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్న నీతూ భాయ్ ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల విక్రయాలు సాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో ఆమెపై ఇప్పటికే 30కి పైగా కేసులు నమోదైనట్లు సమాచారం.గత రెండేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఆమెపై ఈగల్ బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. పక్కా సమాచారంతో తాజాగా ఆమెను అదుపులోకి తీసుకుంది.

రూ.లక్ష నగదు స్వాధీనం

నీతూ భాయ్‌ను అరెస్ట్ చేసిన సమయంలో ఆమె వద్ద ఎలాంటి మత్తు పదార్థాలు లభించలేదని, అయితే సుమారు రూ.లక్ష నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆమె గంజాయి దందా వెనుక ఉన్న ఇతర వ్యక్తులు, నెట్‌వర్క్‌పై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది.

ఈడీ సోదాలతో మరోసారి కలకలం

మరోవైపు నీతూ భాయ్ అక్రమ సంపాదన, మనీలాండరింగ్ వ్యవహారాలపై ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించడం సంచలనం రేపింది. ఇప్పటికే పలు కేసులు ఎదుర్కొంటున్న ఆమె అరెస్టుతో నగరంలో మత్తు పదార్థాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై మరోసారి చర్చ మొదలైంది.



విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి జేసిఎస్

- మెరుగైన విద్య, ఉపాధి అవకాశాల కోసం పోరాడాలి
- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్

హైదరాబాద్ ,తెలంగాణ చౌరస్తా:

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నిర్మాత కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్ 51వ వర్ధంతి సభను మలక్‌పేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, విద్యార్థి ఉద్యమాలకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్, అప్పటి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నీలం రామచంద్రయ్యలను విజయవాడలో అక్రమంగా అరెస్టు చేసి, ఇల్లందు సమీపంలోని చీకటిగండ్ల అడవుల్లో హత్య చేశారని పేర్కొన్నారు.జంపాల చంద్రశేఖర ప్రసాద్‌ను హత్య చేస్తే ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం కనుమరుగవుతుందని భావించిన పాలకుల ఆశలు నెరవేరలేదని, నేడు పీడీఎస్‌యూ దేశవ్యాప్తంగా విస్తరించి విద్యార్థుల హక్కుల సాధన కోసం పోరాడుతోందని అన్నారు.
పీడీఎస్‌యూ కేవలం విద్యార్థుల సమస్యలకే పరిమితం కాకుండా కార్మికులు, కర్షకులు, మహిళలు, మైనార్టీలు, ప్రజాస్వామిక, అస్తిత్వ హక్కుల కోసం జరిగే ఉద్యమాల్లోనూ భాగస్వామ్యమవుతోందని తెలిపారు. విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరిగిపోవడంతో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొని చదువులు పూర్తిచేసినా తగిన ఉపాధి అవకాశాలు లభించడం లేదని విమర్శించారు.నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో వందలాది మంది విద్యార్థులు నష్టపోయినా కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించలేదని ఆరోపించారు. విద్యార్థులు ఆందోళనలు చేపడితే లాఠీచార్జీలు, కేసులతో అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు.జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, రంగవల్లి, రమణయ్య, స్నేహలత, మారోజు వీరన్న వంటి విద్యార్థి ఉద్యమ అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారు కలలుగన్న సమసమాజ స్థాపన కోసం విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ వ్యతిరేక విధానాలను విడనాడి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు గడ్డం గౌతమ్, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు షేక్ ఆసిఫ్, దిల్‌సుఖ్‌నగర్ అధ్యక్షురాలు వెన్నెల, ప్రధాన కార్యదర్శి షేక్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల తీరుపై సర్పంచుల తీవ్ర అసంతృప్తి

- మండల సర్వసభ సమావేశానికి రాని కొందరు అధికారులు..
- ప్రజా సమస్యలు పరిష్కరించేదెవరు?
- గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలకూ మోక్షం లేదు..
- అధికారుల నిర్లక్ష్యంపై సర్పంచుల ఆగ్రహం

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం,గ్రామాల అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న మండల సర్వసభ సమావేశాలు కేవలం చర్చలకే పరిమితమవుతున్నాయని కాల్వశ్రీరాంపూర్ మండల సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.శనివారం మండల ప్రత్యేక అధికారి శ్రీమలా ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ సమావేశంలో వివిధ శాఖల పనితీరు,అధికారుల నిర్లక్ష్య వైఖరి,పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలపై సర్పంచులు గళమెత్తారు.ఈ సమావేశంలో విద్యుత్,వ్యవసాయం,విద్య,ఇరిగేషన్,వైద్యం,రెవెన్యూ,పంచాయతీరాజ్,తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు,అభివృద్ధి పనుల్లో నెలకొన్న అడ్డంకులు,వివిధ శాఖల పరిధిలో పరిష్కారం కావాల్సిన సమస్యలను వివరించి,వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సమావేశాల్లో ప్రస్తావించినా..

పరిష్కారం మాత్రం శూన్యం


గతంలో నిర్వహించిన మండల సర్వసభ సమావేశాల్లో సైతం అనేక ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని,అయినప్పటికీ వాటి పరిష్కారానికి ఎలాంటి పురోగతి కనిపించడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి సమావేశంలో సమస్యలను ప్రస్తావించడం,అధికారులు హామీలు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఉపశమనం కలగడం లేదని విమర్శించారు.సమావేశాల్లో చర్చించిన సమస్యలపై తదుపరి సమీక్ష లేకపోవడం వల్ల అవి పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయని పేర్కొన్నారు.

అధికారుల గైర్హాజరుపై తీవ్ర అభ్యంతరం

మండల సర్వసభ సమావేశానికి,పోలీస్,అటవీశాఖ,ఎక్సైజ్,మత్స్యశాఖ,శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై సర్పంచులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికి వివరించాలి?ప్రజాప్రతినిధులుగా ప్రజల తరఫున సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లే అవకాశం లేకపోతే గ్రామాల అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఏర్పాటు చేసే సమావేశాలకే అధికారులు హాజరుకాకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గైర్హాజరు అధికారులపై చర్యలు తీసుకోవాలి

మండల సర్వసభ సమావేశాలకు విధిగా హాజరుకావాల్సిన అధికారులు గైర్హాజరు కావడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి,బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సర్పంచులు డిమాండ్ చేశారు.గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి,పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని,ఇకనైనా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచులు స్పష్టం చేశారు .ఈ కార్యక్రమం లో ఎంపీడీవో సురేందర్ కుమార్ కుమార్,తహసిల్దార్ డాక్టర్ రాపెల్లి రాముడు,సూపరింటెండెంట్ శ్రీధర్,సీనియర్ అసిస్టెంట్ రంగు రవి,జూనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి,పలు శాఖల మండల అధికారులు,వివిధ గ్రామల సర్పంచ్ లు పాల్గొన్నారు.



యూనివర్సల్ స్కూల్‌లో దీపావళి సంబరాలు

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్ దాస్ నగర్ గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రముఖ పాఠశాల అయిన యూనివర్సల్ ఐ.ఐ.టి / నీట్ ఫౌండేషన్ పాఠశాలలో శనివారం రోజున ఘనంగా దీపావళి సంబరాలు జరిగాయి.ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థుల ఉపన్యాసాలతో మొదలైంది.చెడుపై మంచికి చిహ్నంగా జరుపుకునే పండుగ విశిష్టతను,విద్యార్థులు తెలియ చేశారు.విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి తమదైన శైలిలో దీపాలను మట్టితో,వరిపిండితో తయారు చేసి నానా రకాల ఆకారాలలో తీర్చి దిద్ది గ్రామీణ సంస్కృతిని దృశ్యరూపంలో చూపించి వారి సృజనాత్మకతను చూపించారు.తదనంతరం దీపాల కాంతిలో ధనలక్ష్మి పూజ గావించి పాఠశాల యాజమాన్యం,విద్యార్థులూ, ఉపాధ్యాయులు టపాకాయలు కాల్చారు.దీపాలను తయారు చేయడంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మొదటి,ద్వితీయ, తృతీయ,బహుమత్తులే గాక కన్సొలేషన్ బహుమతులు కూడా యాజమాన్యం వారు అందజేశారు .ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాములు సయ్యద్ అఫ్జల్ మాట్లాడుతూ.... విద్యార్థుల నైపుణ్యతను ప్రశంసిస్తూ,పండగ విశిష్టతను తెలియజేస్తూ సురక్షితంగా పండుగ జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.





పట్టణాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- తొర్రూరులో రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- మరో రూ.20 లక్షలతో ఆధునిక మరుగుదొడ్ల ఏర్పాటు
- పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

తొర్రూరు – తెలంగాణ చౌరస్తా:

పట్టణాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు పట్టణంలోని వివిధ వార్డుల్లో రూ.80 లక్షల సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. చేపట్టిన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల్లో రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపడుతూ తొర్రూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు.రూ.20 లక్షలతో ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణంతొర్రూరు మున్సిపాలిటీలో స్వచ్ఛ భారత్ మిషన్ నిధుల ద్వారా రూ.20 లక్షల అంచనా వ్యయంతో ఆస్పిరేషనల్ టాయిలెట్స్2 పథకం కింద చేపట్టనున్న ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాల్లో పరిశుభ్రత, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సౌకర్యవంతంగా ఉండేలా ఆధునిక వసతులతో మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. తొర్రూరు పట్టణాన్ని పరిశుభ్రమైన, సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, వార్డు కౌన్సిలర్లు బాపు రెడ్డి, పెద్దగాని కళావతి సోమన్న, భద్రు నాయక్, బసనబోయిన ఐలమ్మ, పట్టణ అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్, మండల అధ్యక్షుడు రవీంద్ర చారి, కంటెస్టెడ్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలకే సన్నబియ్యం విక్రయించాలి



- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు
- రెండు దుకాణాల యాజమాన్యాలపై కేసులు నమోదు
- తూనికలు, కొలతల జిల్లా ఇన్‌చార్జి అధికారి కె. విశ్వేశ్వర్

తొర్రూరు – తెలంగాణ చౌరస్తా:

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సన్నబియ్యం, నిత్యావసర సరుకులను విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల జిల్లా ఇన్‌చార్జి అధికారి కె. విశ్వేశ్వర్ హెచ్చరించారు.పౌరసరఫరాల శాఖ, వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో సుమారు 10 బియ్యం, నిత్యావసర సరుకుల దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో సన్నబియ్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా 26 కిలోలుగా ముద్రించిన బస్తాను తూకం వేయగా కేవలం 24 కిలోలు మాత్రమే ఉన్నట్లు వెల్లడైంది. దీంతో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన రెండు దుకాణాల యాజమాన్యాలపై కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా కె. విశ్వేశ్వర్ మాట్లాడుతూ ఎల్‌నినోను సాకుగా చూపిస్తూ పాత సరుకులను కొత్త ధరలకు విక్రయించడం, నిర్ణీత గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) కంటే అధికంగా వసూలు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నిత్యావసర సరుకులను విక్రయించాలని సూచించారు.జిల్లావ్యాప్తంగా అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలు, తూనికలు, కొలతల్లో అక్రమాలు, ఇతర నిబంధనల ఉల్లంఘనలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డీసీఎస్ చైర్మన్ వింజమూరి సుధాకర్, జిల్లా పౌరసరఫరాల అధికారి జాటోత్ రమేష్‌నాయక్, సివిల్ సప్లై స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ జె. వసంత్ కుమార్, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి ప్రజలకు జె.కే. ఇన్ఫ్రా అధినేత దీపావళి శుభాకాంక్షలు

- ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతా
- జెరిపాటి రామరాజు

శేరిలింగంపల్లి – తెలంగాణ చౌరస్తా:




దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని జె.కే. ఇన్ఫ్రా అధినేత జెరిపాటి రామరాజు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరి జీవితంలో దీపావళి కాంతులు నింపాలని కోరుకున్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు సాగుతానని వెల్లడించారు.ఈ దీపావళి ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని కోరుకుంటూ జె.కే. ఇన్ఫ్రా తరఫున శేరిలింగంపల్లి ప్రజలందరికీ మరోసారి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- అధికారులతో వర్చువల్ సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ – తెలంగాణ చౌరస్తా:



పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల ఇళ్లలో వెలిగించే ప్రతి దీపం ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు.
దీపావళి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం అమలుపై శనివారం తొర్రూరు క్యాంపు కార్యాలయం నుంచి నియోజకవర్గ అధికారులతో ఎమ్మెల్యే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసిన ప్రభుత్వం, వారి కుటుంబాల్లో ఆనందం, వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఇందిరమ్మ ఇంటిని దీపాలతో అలంకరించి పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పూర్తయిన ప్రతి ఇందిరమ్మ ఇంటికి విధిగా స్టిక్కర్ వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులంతా భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియతో పాటు బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరిస్తున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు.



యువత డ్రగ్స్‌ కు దూరంగా ఉండాలి

- తొర్రూరు ఎక్సైజ్ సీఐ బుస అశోక్

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:

విద్యార్థులు,యువత డ్రగ్స్ , మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ బూస అశోక్ తెలిపారు.మేరా భారత్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ -2026 కార్యక్రమాన్ని నిర్వహించారు.దీనిలో భాగంగా డ్రగ్స్ నిర్మూలన పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.మై భారత్ జిల్లా యూత్ విభాగం సమన్వయకర్త బానోతు వీరన్న నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ... డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో సమాజంలో మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒకరూ భాగస్వాములు కావాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును, కుటుంబాలను,సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యంపై దృష్టిసారించాలని, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై ఖాదర్ పాషా,పాఠశాల ప్రిన్సిపాల్ విజయరత్నమాల, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సాధికారత రాష్ట్ర పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తుల సమర్పణ
- జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ వెల్లడి

అబ్దుల్లాపూర్‌మెట్ – తెలంగాణ చౌరస్తా:



దివ్యాంగుల సాధికారతకు విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పురస్కారాలు-2026 అందజేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ తెలిపారు. డిసెంబర్ 3న నిర్వహించనున్న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈనేపథ్యంలో వ్యక్తిగత,సంస్థాగత విభాగాల్లో పురస్కారాల కోసం అర్హులైన వ్యక్తులు,సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు నమూనా, మార్గదర్శకాలు, ఇతర పూర్తి వివరాల కోసం తెలంగాణ ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ https://depwdsc.telangana.gov.in ను సందర్శించాలని సూచించారు.పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతచేసి ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని జిల్లా సంక్షేమ అధికారి (మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ) కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.నిర్ణీత గడువు ముగిసిన తర్వాత అందిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబోమని జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ స్పష్టం చేశారు. అర్హులైన వ్యక్తులు, సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భార్యను హత్య చేసి గోదావరిలో పడేసిన ఏఆర్‌పీసీ కానిస్టేబుల్

- 24 గంటల్లో మిస్సింగ్ కేసును ఛేదించిన కొత్తగూడెం పోలీసులు
- నిందితుడితో పాటు మృతదేహాన్ని తరలించడంలో సహకరించిన తండ్రిపై విచారణ

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో – తెలంగాణ చౌరస్తా:

భార్యను హత్య చేసి మృతదేహాన్ని గోదావరి నదిలో పడేసిన ఏఆర్‌పీసీ కానిస్టేబుల్ ఉదంతం కొత్తగూడెంలో వెలుగుచూసింది. కొత్తగూడెం పోలీసులు కేవలం 24 గంటల్లోనే మిస్సింగ్ కేసు మిస్టరీని ఛేదించి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసుల వివరాల ప్రకారం..కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుండారపు స్వరూప తన సోదరి భవాని కనిపించడం లేదంటూ నవంబర్ 6న ఫిర్యాదు చేశారు. దీంతో క్రైమ్ నంబర్ 205/2026 కింద మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. భవాని భర్త, ఏఆర్‌పీసీ 623 కానిస్టేబుల్ బోడా నరేందర్ (30)ను విచారించగా హత్య చేసినట్లు అంగీకరించాడు. నవంబర్ 3న రాత్రి అద్దె ఇంట్లో భార్య భవానిని చేతులతో నులిమి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు వెల్లడించాడు.అనంతరం మృతదేహాన్ని సంచిలో పెట్టి తన తండ్రి హరిలాల్ సహాయంతో గోలియాతండాకు తరలించి వ్యవసాయ పొలంలో దాచిపెట్టాడు. నవంబర్ 4న రాత్రి మళ్లీ తండ్రి సహాయంతో భద్రాచలం గోదావరి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి నదిలో పడేసినట్లు విచారణలో తెలిపాడు.

24 గంటల్లోనే కేసు ఛేదింపు

నిందితుడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు పంచుల సమక్షంలో గోదావరి నదిలో గాలింపు చేపట్టి భవాని మృతదేహాన్ని వెలికితీశారు. నిందితుడు బోడా నరేందర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించే చర్యలు చేపట్టారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పర్యవేక్షణలో కేసును ఛేదించిన డీఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, త్రీ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, వన్ టౌన్ సీఐ జితేందర్, ఎస్సైలు విజయ్ సింహారెడ్డి, రమేష్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



కార్యకర్తలే పార్టీకి అసలైన పునాది

- గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి
- డివిజన్ అధ్యక్షుడు కొడ్డ వేమన
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు ప్రక్రియపై కార్యకర్తలకు దిశానిర్దేశం

అబ్దుల్లాపూర్‌మెట్ – తెలంగాణ చౌరస్తా:



అహర్నిశలు శ్రమించే కార్యకర్తలే భారతీయ జనతా పార్టీకి అసలైన పునాది అని బీజేపీ కుంట్లూర్ డివిజన్ అధ్యక్షుడు కొడ్డ వేమన అన్నారు.శుక్రవారం కుంట్లూర్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన నాయకత్వం వహించగా, డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొడ్డ వేమన మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని సూచించారు.అలాగే డివిజన్ కమిటీ రూపకల్పనలో భాగంగా పార్టీ పట్ల నిబద్ధత కలిగిన కార్యకర్తల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తూ డివిజన్ స్థాయిలో బీజేపీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ డివిజన్ ముఖ్య నాయకులు, ప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లోకి చేరికలు

కాసిపేట, తెలంగాణ చౌరస్తా:

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాసిపేట మండలం కోమటిచేను గ్రామానికి చెందిన సుమారు 30 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రత్నం ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా రత్నం ప్రదీప్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రత్యేక స్థానం ఉంటుందని, యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొని వివిధ స్థాయిల్లో నాయకత్వ బాధ్యతలు చేపట్టాలని అన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ నాయకత్వంలో కాసిపేట మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి జరుగుతోందని పేర్కొన్నారు. సాయిని స్వామి,దుర్గం అరున్,బిడ్డల శేఖర్, దుర్గం సురేష్,దుర్గం శేఖర్, కుమ్మరి దుర్గయ్య,జాడి అన్వేష్, జాడి సిద్ధార్థ్,దుర్గం అరునివి,చాపిడి రాజకుమార్ తదితరులు చేరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రౌతు సత్తయ్య, మైదాం రమేష్, అక్కేపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చాణక్య విద్యార్థుల క్షేత్ర పర్యటన

మానకొండూరు, తెలంగాణ చౌరస్తా:



మండల కేంద్రంలోని చాణక్య హై స్కూల్ పదవ 9వ తరగతి విద్యార్థులు ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాంపల్లి గుట్ట సందర్శించారు పాఠశాల కరస్పాండెంట్ ఆడెపు రవీందర్ గుట్ట యొక్క ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు.ఈ క్షేత్ర పర్యటనలో సుమారుగా 50 మంది విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు